## 8వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

### *నాస్తికులు, తార్కికులు మరియు పవిత్ర నామము*

వర్షాకాలమున సాయంకాలముల యందు చెట్ల మీద మిణుగురులు అక్కడక్కడ కనిపించును. అవి దీపములవలె ప్రకాశించును. కాని ఆకాశమున సహజముగా వెలుగు నక్షత్రములును, చంద్రాది గ్రహములును కనిపించవు. ఈ విధముగానే కలియుగమున నాస్తికులు లేక దుర్మార్గులును చాలా ప్రముఖముగా కనిపింతురు. వైదిక సిద్ధాంతములను అనుసరించి మోక్షమునకై ప్రయత్నించువారు మరుగుననుందురు.

కలియుగము జీవుల వర్షాకాలముతో పోల్చదగినది. ఈ యుగములో భౌతిక నాగరికత పురోగమన ప్రభావము వలన నిజమైన విజ్ఞానము మరుగునపబడినది. కేవలము తార్కికులు, నాస్తికులును, మతసిద్ధాంతములనబడువానిని సిద్ధపరచుచున్నారు. మిణుగురు పురుగుల వలె వారు ప్రముఖులగుచున్నారు. వైదిక సూత్రములను, ఆధ్యాత్మిక ఆదేశములను కఠినముగా పాలించువారు కలియుగమున మేఘములచే కప్పబడినారు.

ప్రజలు మిణుగురు పురుగుల కాంతిని వదిలి ఆకాశమున వెలుగుచుండు సూర్యచంద్రగ్రహ నక్షత్రాది జ్యోతుల వలన ప్రయోజనము పొందుట నేర్చుకోవలెను. వాస్తవముగా మిణుగురు పురుగు, చీకటి రాత్రి యందు ఎట్టి కాంతిని ఈయజాలదు. వానాకాలమందు కూడా కొన్ని వేళలయందు మబ్బులు విడిపోయి సూర్యచంద్రులును మరియు నక్షత్రములును కనిపించును. అట్లే కలియుగమునందును కొన్ని వేళల యందు మేలు కలుగుచుండును. చైతన్యమహాప్రభువు యొక్క వైదికోద్యమము - హరేకృష్ణ మంత్ర ప్రచారము - ఈ విధముగా వ్యాపించుచున్నది. వాస్తవమగు జీవితమును గడుపగోరువారు కేవలం తార్కికులను నాస్తికులను ప్రసరించు గ్రుడ్డి వెలుగు కొరకు ఆశ పడుట మాని ఈ ఉద్యమము నుండి ప్రయోజనము పొందవలెను.

*దేవాదిదేవుడు శ్రీకృష్ణ భగవానుడు*

# చర్చ - విషయ విభాగము

## కృష్ణుని స్థితి

### భగవంతుడు మరియు అతని శక్తులు

దేవదేవుని నియంత్రణలో ఉన్నదని వివరిస్తుంది. భగవద్గీత (9.10)లో శ్రీకృష్ణుడు కూడా ఇదే చెప్పాడు. "ఆయన శక్తులే అన్నింటిని నడుపుతున్నాయి"ని. "*ఏక దేశస్థిత స్యాగ్నేర్ జ్యోత్స్నా నిస్తారినీ యధా*" అంటూ విష్ణు పురాణము ధ్రువీకరిస్తుంది. ఒకేచోట ఉన్న మంటచుట్టూ వేడి మరియు వెలుగు ఏ విధంగా ఆవరించి ఉండును. అదే విధంగా దేవదేవుని నుండి విడివడి వ్యక్తమైన అయన శక్తులే ఈ మొత్తము సృష్టి. ఉదాహరణకు ఒకేచోట ఉన్న సూర్యుడు వేడిని వెలుగును విశ్వమంతా వ్యాప్తి చేస్తున్నట్లు, దేవదేవుడు కూడా తన భౌతిక, ఆధ్యాత్మిక శక్తులను సృష్టి అంతటా విస్తరింపజేస్తున్నాడు.

### కృష్ణుని స్థితి

ఈశోపనిషత్తు ఇలా చెప్తుంది. "తన ఆవాసంలో స్థిరంగా ఉన్నప్పటికీ దేవదేవుడు మనస్సు కన్నా వేగముగా మరియు అందరికన్నా వేగముగా పరిగెట్టగలడు. శక్తివంతులైన దేవుళ్ళు ఆయన దరి చేరలేరు. ఒకేచోట ఉన్నప్పటికీ ఆయన గాలిని, వర్షాన్ని ఇచ్చేవారిని నియంత్రించగలడు. గొప్పదనంలో ఆయన అన్నిటిని అధిగమించగలడు". బ్రహ్మసంహిత ఇటువంటిదే చెప్తుంది. "*గోలోకయేవ నివసతి అఖిలాత్మ భూతః*". శ్రీ కృష్ణుడు గోలోక వృందావనంలో ఎల్లప్పుడు ఉన్నాసరే అదే సమయంలో అన్ని జీవుల హృదయంలోనూ ఉండును. శ్రీకృష్ణుడు గోలోకంలో నిర్వర్తించవలసిన విధులేవి లేవు. ఆయన తన సహవాసుల సహచర్యాన్ని ఆనందిస్తుంటాడు. గోపికలు, గోవులను కాచే గోపబాలురు ఆయన తల్లిదండ్రులు, ఆయన ఆవులు, దూడలు మొదలైనవి. ఆయన పరిపూర్ణ స్వతంత్రుడు. ఆయన సహచరులు మరింత స్వతంత్రులు. ఎందుకంటే వారు ప్రమాదంలో పడినట్లనిపిస్తే వారిని ఎలా రక్షించాలా అని ఆయన ఆరాటపడతాడు. కాని ఆయన సహచరులు మాత్రం ఏవిధమైన ఆత్రుతలు చెందరు. "కృష్ణుడు ఇక్కడే ఉన్నాడు. ఆయన మనలను రక్షిస్తాడు" అని వారనుకుంటారు. భారతదేశంలోని బృందావనంలో 5000 సంవత్సరాల క్రితం లీలలు ప్రదర్శించినప్పుడు ఆయన ప్రతీ రోజు తన గోపబాలురతోను, ఆవు దూడలతోను, యమునా తీరంలోను, యమునా తీరమునందున్న అడవిలోను కలసి ఆడుతుండేవాడు. తరచుగా కంసుడు ఎవరో ఒక రాక్షసుని శ్రీకృష్ణుని, అతని మిత్రులను చంపడానికి పంపుతుండే వాడు. అయినప్పటికీ గోపబాలురు ఏవిధమైన ఆంధోళనను చెందకుండా కృష్ణునితో ఆడుకుంటూ ఆనందిస్తుండేవారు. ఎందుకంటే కృష్ణుడు తమను రక్షిస్తాడన్న అపారమైన నమ్మకం వారికుంది. ఆధ్యాత్మిక జీవనం అంటే అది. అది శ్రీకృష్ణునికి తనని తాను అర్పించుకోవడంతో మొదలవుతుంది.

కృష్ణుడిని శరణువేడుకోవడమంటే ఎటువంటి ప్రమాదకర పరిస్థితిలోలైనా కృష్ణుడు రక్షిస్తాడన్న బలీయమైన నమ్మకం ఉండడం. అందుకు తొలి మెట్టుగా భక్తియుత సేవకు అనుకూలమైన ప్రతీదానిని ఆమోదించడం. భక్తియుత సేవకు విరుద్ధమైనది ఏదైనా సరే తిరస్కరించడం. రెండవ మెట్టు ఎటువంటి పరిస్థితిలోనైనా కృష్ణుడు రక్షించి మనలను పోషిస్తాడన్న నమ్మకం కలిగి ఉండడం. వాస్తవానికి ఆయన ప్రతీ వానికి రక్షణ కల్పిస్తూ పోషిస్తూనే ఉన్నాడు. ఇది వాస్తవం. మాయ (భ్రాంతి) మూలంగా మనల్ని మనమే రక్షించుకుంటున్నామని, మనల్ని మనమే పోషించుకుంటున్నామని అనుకుంటుంటాం.

భక్తుల విషయంలో కృష్ణుడు స్వయంగా వారి రక్షణ, పాలనా బాధ్యతలను స్వీకరిస్తాడు, మామూల మనుషుల విషయంలో కృష్ణుని బాహ్య శక్తి అయిన మాయదేవి ఈ బాధ్యతను స్వీకరిస్తుంది. మాయాదేవి బద్ధ జీవులను శిక్షించే శ్రీ కృష్ణుని ప్రతినిధి. ఈ పరిస్థితిని మనం ఈ విధంగా చూడవచ్చు. మంచి పౌరుల ఆలన పాలనను ప్రభుత్వం స్వయంగా తీసుకుంటుంది. నేరస్తుల వ్యవహారమును కూడా ప్రభుత్వమే చూస్తుంది - జైలు డిపార్టుమెంటు ద్వారా కారాగారంలో ఉన్న ఖైదీలకు తగిన ఆహారం ఇవ్వడం, వారు వ్యాధి బారిన పడితే ఆస్పత్రుల ద్వారా అవసరమైన వైద్య చికిత్స చేయించడం వంటి రక్షణ చర్యలను ప్రభుత్వమే తీసుకుంటుంది. శిక్షణలో భాగంగానే ప్రభుత్వం వారి ఆలనా పాలనా చూస్తుంది.

**ప్రకృతి నియమాలు**

**కనుగొనుట :**

1. కృష్ణుడు ఎక్కడ నివసిస్తాడు? ఆయన భౌతిక జగత్తుని ఎలా పోషిస్తున్నాడు?

**అవగాహన :**

1. కృష్ణుడు దేవాదిదేవుడు ఎందుకో కొన్ని కారణాలను పేర్కొనండి?
2. మనం కృష్ణునికి శరణాగతి చెందుట వలన ఏ విధంగా ఆందోళనలన్నిటి నుండి విముక్తులవగలము? ఒక ఉదాహరణతో వివరించండి.
3. ఏ విధముగా మనము ఆచరణాత్మకముగా కృష్ణునికి శరణాగతిని వ్యక్తము చేయగలము?
4. కృష్ణునికి శరణాగతి పొందని వారి పాలన ఎవరు చూస్తారు? వారి పట్ల ఏవిధమైన ప్రవర్తన ఉంటుంది?

**అనువర్తనము :**

1. మీరు అత్యంత ఆందోళనలో ఉన్నటువంటి ఒక సందర్భమును పంచుకోండి. అప్పుడు మీరు ఎలా ప్రతిస్పందించారు? అప్పుడు మీరు వేరే విధంగా స్పందించి ఉంటే బాగుండేదని మీరనుకుంటున్నారా? ఎందుచేత?

## ప్రచారమే సర్వసారము

### *ప్రచారకుడు భగవంతునికి అత్యంత ప్రియమైనవాడు*

"అందుచేత, నా యువ స్నేహితులరా ... సమస్త జీవులకు జ్ఞానోదయము కలిగించుట ద్వారా వారిపై కరుణను చూపి, ఆ విధంగా వారి శ్రేయోభిలాషులు కావాలి."

భగవద్గీత (18.55) యందు శ్రీకృష్ణుడు "*భక్త్యా మామభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః*" అని పలికెను. అనగా కేవలము భక్తియుత సేవ ద్వారా మాత్రమే మనుజుడు భగవంతుని యథారూపముగా అవగాహన చేసికొనగలడు. కృష్ణభక్తిభావనను ఎల్లరకు ప్రచారము కావించుటనెడి భక్తియోగవిధానమును చేపట్టమని భక్తప్రహ్లాదుడు తుట్టతుదకు దానవపుత్రులగు సహాధ్యాయులకు ఉపదేశించెను. ప్రచారమే భగవంతుని మహోన్నత సేవ. భక్తి ప్రచారమున పాల్గొనినవాని యెడ భగవానుడు శీఘ్రమే అమిత సంతుష్టుడగును. ఈ విషయము భగవంతుని చేతనే స్వయముగా భగవద్గీత (18:69) యందు ధ్రువపరుపబడినది. 'న చ తస్మాత్ మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః" - "నాకు అతని కన్నను ప్రియమైన సేవకుడు మరొకడు ఈ ప్రపంచమున లేడు. అతనికి మించిన ప్రియమైనవాడు వేరొక్కడు ఉండబోడు".

ఎవడేని శ్రద్ధాపూర్వకముగా తన శక్త్యానుసారము భగవన్మహిమలను, భగవంతుని సర్వాధిక్యమును ప్రచారము చేయుట యత్నించినచో అతడు చక్కగా చదువుకోనివాడైనను భగవానునికి ప్రియ సేవకుడు కాగలడు. ఇదే భక్తి యనబడును. శత్రుమిత్రభేదభావము లేకుండ ఎవడేని ఈ సేవను సమస్త మానవాళికి ఒనరించినచో భగవంతుడు మిగుల ప్రసన్నుడగును; అంతట ఆ భక్తుని జన్మమే సఫలమగును. కనుకనే శ్రీచైతన్య మహాప్రభువు ప్రతియొక్కడు గురువుగానై కృష్ణభక్తిని ప్రచారము చేయవలెనని ఉపదేశించిరి. యారా దేఖ తారే కహ కృష్ణ ఉపదేశ (చై.చ. మధ్య 7:128). భగవదనుభూతికి అదియే సులభతరమైన పద్ధతి.

***శ్రీమద్భాగతము 7:6-24***